బీఆర్ఎస్ అధినేతను కలిసిన రెడ్యానాయక్



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

నర్సింహులపేట/చిన్నగూడూరు, అక్టోబర్ 3: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను గురువారం డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఎడవల్లిలోని ఫాంహౌస్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

బలపాల పీహెచ్‌సీలో తనిఖీలు

బలపాలలో పీహెచ్‌సీ భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

కురవి, అక్టోబర్ 3 : కురవి మండలం బలపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిసరాల్లో ఇటీవల నిర్మించిన నూతన పీహెచ్‌సీ భవనాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మురళీధర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. జిల్లా కీటకజనిత వ్యాధుల నియంత్రణాధికారి డాక్టర్ సుధీర్‌రెడ్డి, జిల్లా పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ కావేటి మంగమ్మ, జిల్లా సబ్‌యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, వైద్యాధికారిని స్రవంతితో కలిసి భవన సముదాయాన్ని పరిశీలించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ...భవన నిర్మాణం పూర్తయిందని, అతి త్వరలోనే సేవలను అందుబాటులోకి తెస్తామన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు మెగురైన వైద్యం అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కుమార్ స్వామి, ఆరోగ్య విస్తరణాధికారి స్వామి పాల్గొన్నారు.

రెవెన్యూ భూమి పరిశీలన

భూమిని పరిశీలిస్తున్న ఎన్‌హెచ్, అటవీ, రెవెన్యూ అధికారుల బృందం

బయ్యారం, అక్టోబర్ 3: మండలంలోని రామచంద్రాపురం పంచాయతీలోని రెవెన్యూ భూమిని అటవీ, రెవెన్యూ, ఎన్‌హెచ్ శాఖల అధికారుల బృందం గురువారం పరిశీలించింది. వలిగొండ నుంచి కొత్తగూడెం వరకు చేపట్టనున్న ఎన్‌హెచ్-930పీ విస్తరణలో భాగంగా మండలంలోని నామాలపాడు శివారు నుంచి భద్రాద్రి కొత్తగూడెం నెహ్రూనగర్ శివారు వరకు సుమారు 10హెక్టార్ల అటవీశాఖ భూమి ఎన్‌హెచ్ విస్తరణ సందర్భంగా ఆ శాఖ కోల్పోతున్నది. కాగా, అటవీ శాఖకు భూమిని బదలాయించేందుకు రామచంద్రాపురం పరిధిలో సర్వే నంబర్ 60లోని రెవెన్యూ భూమిని డీఎఫ్‌వో విశాల్, ఎన్‌హెచ్ ఈఈ మనోహర్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం పరిశీలించింది. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో సువత్సలారెడ్డి, ఎన్‌హెచ్‌డీఈ అమీర్‌పాషా, ఏఈ మోహర్, రెవెన్యూ సర్వేయర్ శివయ్య పాల్గొన్నారు.

డిజిటల్ ఫ్యామిలీ సర్వే పరిశీలన

మహబూబాబాద్ రూరల్ : మానుకోట మున్సిపాలిటీ పరిధిలో రజాలి పేట, సలార్‌తండాలో నిర్వహించిన ఫ్యామిలీ డిజిటల్ సర్వేను గురువారం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు చేస్తున్న సర్వే తీరును స్థానికులను అడిగి తెలుకున్నారు. ఒకరికి ఒక డిజిటల్ ఐడీ, మొత్తం ఫ్యామిలీకి డిజిటల్ ఐడీ ద్వారా పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

వివరాలు పక్కాగా సేకరించాలి

దంతాలపల్లి, అక్టోబర్ 3: ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కోసం వివరాలను పక్కాగా సేకరించాలని తొర్రూరు ఆర్డీవో రమేశ్ తెలిపారు. మండలంలో రామవరం గ్రామంలో అధికారులు గురువారం ఇంటింటికీ వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. ఆయా కుటుంబాల్లో పుట్టిన, మరణించిన వారి వివరాలను నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్, ఆర్ఐ నజీముద్దీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

మరిపెడ మండలం గుండెపుడిలో ఇంటిపై పడిన చెట్టు

నర్సింహులపేట: పిచ్చిరాంతండాలో ఇంటిపై కూలిన విద్యుత్‌స్తంభం

డోర్నకల్ : గొల్లచర్ల- ముల్కలపల్లి వెళ్లే మార్గంలో ..

గాలివాన బీభత్సం

- నేలవాలిన వరి, మిరుప పంటలు
- విద్యుత్ స్తంభాలపై విరిగిపడిన చెట్లు

ల్లికుదురు: మునిగలవీడులో నేలవాలిన వరి

నర్సింహులపేట/డోర్నకల్/చిన్నగూడూరు/నెల్లికుదురు, అక్టోబర్ 3 : జిల్లాలో బుధవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. చేతి కందే దశలో ఉన్న పంటలు దెబ్బతినడంతో ఆందోళన చెందుతున్నారు. నర్సింహులపేట మండలంలో పొట్ట దశలో ఉన్న వరి పంట నేలవాలడంతోపాటు మిరుప మొక్కలు కింద పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. డోర్నకల్ మండలం ముల్కలపల్లి నుంచి ఖమ్మం వెళ్లే ప్రధాన రోడ్డుపై చెట్టు విరిగి విద్యుత్‌స్తంభంపై పడింది. దీంతో కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టారు. గొల్లచర్ల క్రాస్ రోడ్డు నుంచి ముల్కలపల్లి వెళ్లే మార్గమధ్యంలో చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడింది. చిన్నగూడూరు మండలంలో చిన్నగూడూరు-పగిడిపల్లి, ఉగ్గంపల్లి-ఎల్లంపేట రహదారిపై చెట్లు విరిగిపడ్డాయి. మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్(అద్దె భవనంపై)పై చెట్లు విరిగిపడి రేకుల షెడ్ ధ్వంసమైంది. ఉగ్గంపల్లికి చెందిన కొంపెల్లి రామ్మూర్తి ఇంటి పై కప్పు కూలింది. మరిపెడ మండలం గుండెపుడిలో చెట్టు విరిగి పడడంతో వడ్లకొండ సోమమ్మ కొడుకుల రెండు ఇండ్లు దెబ్బతిన్నాయి. నెల్లికుదురు మండలం మునిగలవీడు గ్రామానికి చెందిన సంపతయ్య, రజితతోపాటు మరికొంత మంది రైతుల వరి పంట నేలవాలింది.

ప్రజాపాలనలో ప్రజల కష్టాలు

- మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదు..
- బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మహేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

ఇనుగుర్తి, అక్టోబర్ 3 : ప్రజాపాలనలో ప్రజలు కష్టాలు పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బొబ్బిలి మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బేతమల్ల చంద్రయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇనుగుర్తిని మండలం చేయకపోతే ఎమ్మెల్యే పదవికి తాను రాజీనామా చేయడంతోపాటు భవిష్యత్‌లో మళ్లీ ఎమ్మెల్యేగా పోటీ చేయనని అసెంబ్లీలో కొట్లాడి ఇనుగుర్తిని మండలాన్ని సాధించిన ఘనత మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌ది అన్నారు. మండలంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి, తహసీల్దార్‌ను నియమించారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో మండలానికి తహసీల్దారే కరువయ్యాడని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మండలానికి చేసిందేమీ లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కూరెల్లి సతీశ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతి తండాకు బీటీ రోడ్లు, సీసీరోడ్లు వేశామన్నారు. బీఆర్ఎస్ హయాంలో సంక్షేమ ఫలం అందని ఇల్లు లేదన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం అసంపూర్తిగా ఉందని, ఎమ్మెల్యే మురళీనాయక్ ఎస్‌డీఎఫ్ ద్వారా నిధులు మంజూరు చేసి పనులు చేయిస్తానని చెప్పి యాదిమరిచారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దీకొండ వెంకన్న, మాజీ సర్పంచ్‌లు దార్ల రామ్మూర్తి, మామిడి శోభన్, రామన్ననాయక్, మాజీ ఎంపీటీసీలు పింగిలి రజితాశ్రీనివాస్, మాలోత్ మంజులామంగ్యానాయక్, ఉపసర్పంచ్‌లు, గ్రామ ప్రధాన కార్యదర్శి గండు నాగన్న, నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

మాట్లాడుతున్న ఎంపీ బలరాంనాయక్

గార్ల, అక్టోబర్ 3 : అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని మహబుబాబాద్ ఎంపీ బలరాంనాయక్ అన్నారు. గురువారం మండలంలోని తిర్లాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ఆలిండియా రాజీవ్ గాంధీ గ్వర్‌బాయ్ మాతృ ఆత్మీయ సమ్మేళన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బంజారాలు ఐక్యంగా ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందాలన్నారు. మహబూబాబాద్ నుంచి గార్ల, డోర్నకల్ మీదుగా ఆర్టీసీ బస్సు ఖమ్మం నడిపించేందుకు డిపో మేనేజర్‌తో మాట్లాడుతానన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రావురి వెంకటరామయ్య, తాళ్లపల్లి కృష్ణగౌడ్, జలీల్, గుండా వెంకట్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి , యాకూబ్ పాషా, వెంకట్ లాల్, లచ్చిరాం నాయక్, శంశాద్ బేగం పాల్గొన్నారు.

బతుకమ్మ ఆటకు మహిళల కష్టాలు

లో లెవల్ కల్వర్టు వద్ద పొలాల్లోని నీటిలో వదిలిన బతుకమ్మలు

నర్సింహులపేట, అక్టోబర్ 3 : మండల కేంద్రంతోపాటు రామన్నగూడెం గ్రామాల్లోని చెరువులు భారీ వర్షం కారణంగా తెగిపోవడంతో బతుకమ్మ ఆడుకునేందుకు మహిళలు ఇబ్బందిపడ్డారు. రామన్నగూడెంలోని ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద బతుకమ్మ ఆడిన మహిళలు దగ్గరలోని లోలెవల్ కల్వర్టు వద్ద నీటిలో, మండల కేంద్రంలో గంగయ్యకుంట వద్ద, కొమ్ములవంచలో నర్సింహులపేట దారిలోని లోలెవల్ కల్వర్టులో బతుకమ్మలను వదిలారు.

మార్కెట్‌లో కూలీల మెరుపు సమ్మె

కేసముద్రం, అక్టోబర్ 3: సమస్యల పరిష్కారం కోసం కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం కూలీలు మెరుపు సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ.. మార్కెట్‌లో పని చేసే కూలీలు, హమాలీలు, దడువాయిలకు రెండు సంవత్సరాలకోసారి రేట్లు పెంచాల్సి ఉందన్నారు. హమాలీలు, దడువాయిలకు రేట్లు పెంచి కూలీలకు పెంచలేదని వాపోయారు. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో పనులు చేయకుండా సమ్మెకు దిగినట్లు తెలిపారు. దీంతో రెండు గంటల పాటు పనులు జరుగకపోవడంతో రైతులు మార్కెట్‌లో పడిగాపులు కాచారు. ఈ విషయంపై మార్కెట్ కార్యదర్శి అమరలింగేశ్వరరావు కూలీలతో మాట్లాడారు. రేట్లు పెంచే విషయం కలెక్టర్ చేతిలో ఉందని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో కూలీలు సమ్మె విరమించి పనిలోకి వెళ్లారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

డోర్నకల్, అక్టోబర్ 3 : దంతాలపల్లి మండలం నిధానపురంలో ఎస్సీ కులస్తుల భూమిని బీసీ కులస్తులు కబ్జా చేయడంతోపాటు కులం పేరుతో దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి ఇరుగు రవి అన్నారు. గురువారం డోర్నకల్ ఎస్సీ బీసీ కాలనీలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. ఎమ్మార్పీఎస్ జెండాను కింద పడేసి దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టల వెంకటేశ్వర్లు, కందిపాటి వెంకటేశ్, లక్ష్మణ్, వినయ్, రమేశ్, అజయ్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఏయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ హైమావతి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను ఆమె సందర్శించి మాట్లాడారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో హెచ్ఐవీ స్క్రీనింగ్ పరీక్షలు చేయాలన్నారు. పాజిటివ్‌గా నిర్ధారణ అయితే జిల్లాకేంద్రంలోని ఐసీటీసీ సెంటర్‌కు పంపించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ రాజ్‌కుమార్, వైద్యులు వెంకట్, మురళీధర్, సుధీర్‌రెడ్డి, జగదీశ్వర్ పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 3 : మైనర్లకు వాహనాలిస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ఎస్సీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. గురువారం జిల్లా వ్యాప్తంగా మైనర్ డ్రైవింగ్, రాష్, ట్రిపుల్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి 128 కేసులు నమోదు చేశామన్నారు. పండుగ సెలవుల్లో పిల్లలు ఇండ్ల వద్దే ఉంటారని, వారికి వాహనాలు ఇవ్వొద్దని ఎస్సీ సూచించారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

బయ్యారం, అక్టోబర్ 3: టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని గురువారం స్థానిక జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు సెప్టెంబర్ 30న ప్రారంభమైందన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటునమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ , జిల్లా ప్రధాన కార్యదర్శి యాకూబ్, జిల్లా కార్యదర్శి మంజుల, సీనియర్ నాయకులు ఆర్‌వీ ప్రసాద్, బస్వ వెంకన్న, రమ్య, భద్రూనాయక్, సుందర్‌కుమార్ పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

పెద్దవంగర, అక్టోబర్ 3 : రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ఒకేసారి చేస్తామని చెప్పి, కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. గురువారం మండలంలోని బొమ్మకల్లు, కొరిపల్లి, పోచారం గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ, రైతు భరోసా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ తొర్రూరులో శుక్రవారం నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, వీరన్నయాదవ్, వెంకట్రామయ్య, ముజిబుద్దీన్, సాయిలు, బాలు, కృష్ణరెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

కాసం షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవంలో అపశ్రుతి

కుప్ప కూలిన స్టేజీ.. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డికి తీవ్రగాయాలు

తొర్రూరు, అక్టోబర్ 3 : నిర్వహణ లోపం.. నిర్వాహకుల నిర్లక్ష్యం.. స్టేజీ ఏర్పాటులో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో తొర్రూరు పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాసం షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో అపశ్రుతి జరిగింది. గురువారం కాసం షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రారంభోత్సవానికి సినీ హీరోయిన్ ప్రియాంక మోహన్, షాపింగ్ మాల్ నిర్వాహకులతో కలిసి కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి వేదికపైకి వచ్చారు. అక్కడికి విచ్చేసిన పట్టణ వాసులకు అభివాదం చేశారు. ఆ సమయంలో స్టేజీపైకి పరిమితికి మించి జనం రావడంతో ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో ఝాన్సీరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. దీంతో కాలుకు గాయం కావడంతో వైద్యుల సూచన మేకు హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు ఆమె కాలు విరిగినట్లు నిర్ధారించారు. ఝాన్సీరెడ్డి త్వరగా కోలుకోవాలని నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకాంక్షించారు. ఆమెను మంత్రి పొంగులేటి పరామర్శించారు.

ఝాన్సీరెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

పీఆర్‌టీయూ జిల్లా నూతన కార్యవర్గం

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 3 : పట్టణంలోని బాలాజీ గార్డెన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో పీఆర్‌టీయూ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సంకా భద్రీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా మిర్యాల సతీశ్‌రెడ్డితోపాటు మండలాల అధ్యక్షులు, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. భవిష్యత్‌లో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు క్యాలెండర్ తెచ్చేవిధంగా పీఆర్‌టీయూ కృషి చేస్తుందన్నారు.

పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలి

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 3 : పూర్తిస్థాయిలో రుణమాఫీ అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి అన్నారు. గురువారం మాధవాపురంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో గెలవడానికి అనేక హామీలను ఇచ్చాయని, ఎన్నికల తర్వాత పట్టించుకోవడం లేదన్నారు. హామీలను అమలు చేసేలా పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో యాకయ్య, లింగన్న, శ్రీను, వేణు, సతీశ్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మహబూబాబాద్ రూరల్ : పెండింగ్‌లో ఉన్న ఐకేపీ వీవోఏల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. గురువారం పలువురు వీవోఏలు కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 50మంది వీవోఏలకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, ఆందోళనలు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వసంత, శ్రీను, అశ్విని, లలిత, సునీత పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడాలి

మహబూబాబాద్ రూరల్ : ప్రజాసమస్యల పరిష్కారం కోసం సీపీఎం నిరంతర పోరాటం చేస్తుందని జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. గురువారం పట్టణంలోని గుమ్ముడూరులో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను లొంగదీసుకుని, చట్టాల ఉల్లంఘనకు పాల్పడుతుందన్నారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక విధానం పేరుతో జమిలి ఎన్నికల కోసం ప్రయత్నిస్తున్నదని, ఒకేసారి ఎన్నికలు తెచ్చి అడ్డదారిలో గెలవడానికి ఎత్తుగడలు వేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సోమయ్య, సీతారాం, శ్రీనివాస్, యాకయ్య, భిక్షపతి, నరేశ్ పాల్గొన్నారు.

8న జాబ్ మేళా

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 3 : నిరుద్యోగ యువత కోసం ఈ నెల 8న పట్టణంలోని ఏబీ ఫంక్షన్ హాల్‌లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు అదనపు ఎస్పీ చెన్నయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూమింగ్ ఎక్సలెన్స్ సహకారంతో ఏర్పాటు చేస్తున్న ఈ మేళాలో 40 కంపెనీలకు పైగా పాల్గొంటాయని, పది తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్ వంటి విద్యార్హతలున్న వారు ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

ప్రారంభమైన ఓపెన్ పరీక్షలు

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 3 : తెలంగాణ ఓపెన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదో తరగతి, ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఓపెన్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్ తెలిపారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఓపెన్ ఇంటర్ పరీక్షలు 44మంది రాయగా, 24మంది గైర్హాజరు, ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో పదో తరగతి ఓపెన్ పరీక్షలు 51 మంది రాయగా, 20మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. ప్రతి సెంటర్‌ను సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు సందర్శించాలన్నారు.

ఘనంగా సందల్ వేడుకలు

కేసముద్రం : జమలాపురం దర్గాలో గురువారం సందల్ (గంధం) పండుగను ఘనంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ పూజల్లో దర్గా పీఠాధిపతి ఖాజా నసీరుద్దీన్, నిజాముద్దీన్, యాకూబ్, నవాబ్, సర్వర్, ఫయాజ్, సాజిద్ పాల్గొన్నారు.

అడవి పంది మాంసం స్వాధీనం ?

బయ్యారం, అక్టోబర్ 3 : ఓ ఇంట్లో నిల్వఉంచిన అడవి పంది మాంసాన్ని గురువారం ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మండలంలోని బాలాజీపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అడవి పంది మాంసాన్ని కొనుగోలు చేసి రిఫ్రిజిరేటర్‌లో నిల్వ ఉంచగా, సమాచారం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఏజెన్సీలోని కంబాలపల్లి గ్రామం నుంచి మాంసం రవాణా అయినట్లు తెలిసింది.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

నెల్లికుదురు, అక్టోబర్ 3 : ఉరేసుకొని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో గురువారం జరిగింది. ఎస్సై రమేశ్‌బాబు కథనం ప్రకారం..నైనాలకు చెందిన ఏర్పుల వెంకటమల్లు (40) క్వారీలో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఓ ప్రమాదంలో చేతివేళ్లకు గాయాలై, అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇక తాను ఏ పనీ చేయలేనని మనస్తాపంతో గురువారం ఇంట్లో ఉరేసుకున్నాడు. అతడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మోటర్ సైకిళ్ల దొంగ అరెస్ట్

10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 3 : ద్విచక్రవాహనాల దొంగను టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం రాత్రి టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ తిరుపతిరావు వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. గురువారం పట్టణ శివారులోని సలార్‌తండా వద్ద ఎస్సై విజయ్‌కుమార్ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఒక వ్యక్తి మోటర్ సైకిల్‌పై కురవి నుంచి వస్తూ పోలీసులను చూసి బండిని రోడ్డు పక్కన పడేసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. కురవి మండలం నారాయణపూర్‌కు చెందిన ధరావత్ బావ్‌సింగ్ గుర్తించారు. కొంతకాలంగా ప్రభుత్వ వైద్యశాల, నెహ్రూసెంటర్, కురవి వీరభద్రస్వామి ఆలయం చుట్టుపక్కల పది బైక్‌లను దొంగిలించి, ఆరింటిని తక్కువ ధరకు అమ్మినట్లు ఒప్పుకున్నాడు. జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేసినట్లు తెలిపాడు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండోరోజూ సర్టిఫికెట్ల పరిశీలన

మహబూబాబాద్ రూరల్ : టీచర్స్ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించిన డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ద్వారా సమాచారం వచ్చిన అభ్యర్థులకు రెండో రోజు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఫాతిమా హైస్కూల్‌లో నిర్వహించినట్లు డీఈవో రాజేశ్వర్ తెలిపారు. 960మందికి 571 మంది హాజరయ్యారని, ఈ నెల 5 వరకు వెరిఫికేషన్ ఉంటుందన్నారు. పీఈటీ, స్కూల్ అసిస్టెంట్లు వెరిఫికేషన్‌కు హాజరు కావాలన్నారు.

నంబర్ ప్లేట్ తప్పని సరిగా ఉండాలి

మహబూబాబాద్ రూరల్ : వాహనాలకు తప్పనిసరిగా నంబర్ ప్లేట్లు ఉండాలని రూరల్ సీఐ సర్వయ్య అన్నారు. గురువారం జమాండ్లపల్లిలో వాహనతనిఖీల్లో భాగంగా ఆయన మాట్లాడుతూ..స్పీడ్ డ్రైవింగ్ చేయొద్దని, హెల్మెట్‌ను ధరించాలన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై దీపికారెడ్డి, కేసముద్రం ఎస్సై మురళి పాల్గొన్నారు.

యోగా పోటీలకు మరిపెడ విద్యార్థులు

మరిపెడ, అక్టోబర్ 3 : రాష్ట్రస్థాయి యోగా పోటీలకు మరిపెడ ఉన్నత పాఠశాల విద్యార్థులు లోకేశ్, ఆఫ్రీద్ ఎంపికయ్యారు.